సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

గురువారం ౹ 9 ౹ జనవరి ౹ 2025



చీనీ టన్ను రూ.23,190

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23,190, కనిష్టంగా రూ.5 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.12

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

30.4°/09.2°

జిల్లాలో బుధవారం కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెల్లవారుజామున చలి తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు మంత్రి నారా లోకేష్



విమానాశ్రయంలో పర్యటిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర విద్యాశాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం జిల్లాకు విచ్చేస్తున్నారు. సాయంత్రం 4.15 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకోనున్న ఆయన, అక్కడి నుంచి రోడ్డుమార్గంలో కొత్తచెరువు, ధర్మవరం మీదుగా అనంతపురం వెళ్లనున్నారు. అక్కడ నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహరాజ్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. లోకేష్ పర్యటన నేపథ్యంలో బుధవారం ఎస్పీ రత్న అధికారులతో కలిసి విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ సీఐలు బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, బొజ్జప్ప ఉన్నారు.

‘పురం’లో నియంత పాలన సాగుతోందా?

- ఎమ్మెల్యే బాలయ్య పీఏ శ్రీనివాసులు ఆగడాలు శ్రుతిమించాయి
- మునిసిపల్ కాంట్రాక్టర్ ఆవేదన



మాట్లాడుతున్న కాంట్రాక్టర్ గోవర్ధన్‌బాబు

హిందూపురం: హిందూపురంలో నియంత పాలన సాగుతోందా అని మునిసిపల్ కాంట్రాక్టర్ గోవర్ధన్ బాబు ప్రశ్నించారు. ఆయన బుధవారం హిందూపురం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తనకు పనుల కాంట్రాక్టు దక్కిందని, వాటిని చేయడానికి అధికారుల అనుమతి కోరితే ముందు ఎమ్మెల్యే ఆఫీసుకు వెళ్లి కలవాలని అంటున్నారని చెప్పారు. అక్కడికెళితే ఎమ్మెల్యే పీఏ శ్రీనివాసులు ‘నీవెవరు కాంట్రాక్ట్ చేయడానికి’ అంటూ దౌర్జన్యం చేశాడన్నారు. అతని అనుచరులు తనను బయటకు గెంటేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లను నేరుగా బెదిరిస్తున్నారని, అస్మదీయులకే పనులన్నీ కట్టబెడుతున్నారని వాపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెబుతున్న మాటలకు.. హిందూపురంలో జరుగుతున్న పాలనకు పొంతనే లేదన్నారు. తాను రూ.5 లక్షల విలువైన మొక్కల సరఫరా, రూ.16 లక్షలతో 85 చెత్త బండ్ల సరఫరా టెండర్లను ఆన్‌లైన్ ద్వారా దక్కించుకున్నానన్నారు. వీటిలో ముందుకు వెళ్లడానికి అధికారులు సహకరించడం లేదని, ఎమ్మెల్యే పీఏలు దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. న్యాయబద్ధంగా టెండర్లు వస్తే పనులు చేయకుండా అడ్డుకోవడానికి ఎమ్మెల్యేల పీఏల అజమాయిషీ ఏమిటని ప్రశ్నించారు.

మానవత్వంతో ఆదుకోండి

- సర్వం కోల్పోయాం..సాయం చేయండి
- కేంద్ర బృందం ఎదుట రైతుల వేడుకోలు

ముదిగుబ్బ/తాడిమర్రి: ‘పంటలన్నీ చేతికందకుండా పోయాయి... ప్రత్యామ్నాయ పంటలూ దెబ్బ తిన్నాయి. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సాయమూ అందలేదు. కేంద్రం నుంచి సాయం అందించి ఆదుకోకపోతే మా పరిస్థితి మరింత దయనీయంగా మారుతుంది’ అని జిల్లా రైతులు కేంద్ర కరువు బృందం ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. మానవత్వంతో ఆదుకోవాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో వాస్తవ పరిస్థితులు తెలుసుకునే నిమిత్తం బుధవారం కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంసీటీ) జిల్లాలో పర్యటించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన అండర్ సెక్రటరీ జయంతి కనోజియా, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.పొన్నుస్వామితో కూడిన ఇద్దరు సభ్యుల బృందం జిల్లాలో పర్యటించింది.



తాడిమర్రిలో ఉలవ సాగుపై రైతుతో మాట్లాడుతున్న కేంద్ర కరువు బృందం సభ్యులు

రైతులతో ముఖాముఖి

తాడిమర్రిలో పర్యటించిన కరువు బృందం సభ్యులు ఈద్గా వద్ద రైతు గంగులకుంట గోపాల్‌రెడ్డి సాగు చేసిన జొన్న, భాస్కర్ నాయుడు సాగు చేసిన ఉలవ పంటలను పరిశీలించారు. పంటల సాగుకు పెట్టుబడులు, దక్కిన దిగుబడులు, వర్షాభావ పరిస్థితులు తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర బృందం సభ్యులు రైతులు, సీపీఐ, సీపీఎం నాయకులతో ముఖాముఖి అయ్యారు. వారి అభిప్రాయాలు సేకరించారు. మేడిమాకులపల్లి గ్రామానికి చెందిన యర్రగంగు రఘురామ్ చౌదరి మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులతో పంటలు సక్రమంగా పండక రైతులు ఏటా నష్టపోతున్నారని వివరించారు. అలాగే కూలీల సమస్య తీవ్రంగా ఉందని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతులకు ఎంతో ఊరట లభిస్తుందన్నారు. రైతు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, మండలానికి సమీపంలో ఉన్న చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి మండలంలోని చెరువులను నింపితే భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నిడిగల్లు సర్పంచ్ వెంగమనాయుడు మాట్లాడుతూ, పీఏబీఆర్ నీటిని సకాలంలో విడుదల చేసి మండలంలోని చెరువులన్నీ నింపాలన్నారు. సీపీఐ ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శి వేమయ్య మాట్లాడుతూ, హంద్రీ-నీవా కాల్వ నీటిని ఉమ్మడి అనంతపురం జిల్లాకు అధికంగా కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర బృందం సభ్యులు ప్రభుత్వానికి నివేదిక పంపుతామని హామీ ఇచ్చారు. కేంద్ర బృందం వెంట ఆర్డీఓ మహేష్, జిల్లా వ్యవసాయ అధికారి వైవీ సుబ్బారావు, జిల్లా ఉద్యానవన అధికారి చంద్రశేఖర్, జిల్లా ప్రణాళికా అధికారి విజయ్‌కుమార్, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి పద్మమ్మ, ఎన్ఆర్ఈజీఎస్ పీడీ విజయ్ ప్రసాద్, ఏపీఎంఐపీ ఏడీ సుదర్శన్ తదితరులు ఉన్నారు.

అలా వచ్చి ... ఇలా వెళ్లారు..

కేంద్ర బృందం సభ్యుల జిల్లా పర్యటన హడావుడిగా సాగింది. ముదిగుబ్బ మండలాన్ని తీవ్ర కరువు బారిన పడిన మండలంగా గుర్తించిన నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి కేంద్రానికి నివేదికను సమర్పించాలని కేంద్ర బృందం బుధవారం ఉదయమే జొన్నల కొత్తపల్లి గ్రామాన్ని సందర్శించింది. గ్రామానికి చెందిన రైతులు చాలా మంది మాట్లాడేందుకు ప్రయత్నించినా హడావుడిగా కార్యక్రమాన్ని ముగించారు. అలాగే తాడిమర్రిలోనూ కేవలం జాతీయ రహదారి పక్కన ఉన్న క్షేత్రాలను పరిశీలించి వెళ్లిపోయారు.



జొన్నల కొత్తపల్లిలో పంటనష్టం గురించి కేంద్ర బృందానికి తెలుపుతున్న మహిళా రైతు

ప్రకృతి వైపరీత్యాలతో పంటలు కోల్పోయాం

బుధవారం ఉదయం కేంద్ర కరువు బృందం ముదిగుబ్బ మండలం జొన్నలకొత్తపల్లి గ్రామంలో పర్యటించింది. బృందం సభ్యులు జయంతి కనోజియా, డాక్టర్ కె.పొన్నుస్వామి జిల్లా అధికారులతో కలిసి కంది, అలసంద, వేరుశనగ తదితర పంటలను పరిశీలించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు కరువు బృందం ఎదుట తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సకాలంలో వర్షాలు కురవక దిగుబడి అందక ఏటా నష్టాలను చవిచూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఖరీఫ్‌లోనూ ప్రకృతి వైపరీత్యాలతో పంటలన్నీ కోల్పోయామని, కేంద్రం ఆదుకునేలా చూడాలని కోరారు.



జొన్నలకొత్తపల్లి పొలాలను పరిశీలిస్తున్న కరువు బృందం సభ్యులు

రేపు ముక్కోటి ఏకాదశి

ముస్తాబవుతున్న ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం



కదిరి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు



ప్రత్యేక అలంకరణలో ఖాద్రీశుని ఆలయం

కదిరి టౌన్: ముక్కోటి ఏకాదశికి జిల్లా ముస్తాబవుతోంది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల వద్ద బారులు తీరనున్న నేపథ్యంలో ఆయా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ముక్కోటి ఏకాదశిని వైకుంఠ ఏకాదశి అని కూడా పిలుస్తారు. ఆ రోజు స్వామి వారిని ఉత్తర ద్వారం నుంచి దర్శనం చేసుకుంటే పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. అందుకే ఆ రోజు ఆలయాలు భక్తులతో పోటెత్తుతాయి.

ఖాద్రీ ఆలయంలో ఏర్పాట్లు..

ముక్కోటి ఏకాదశికి కదిరిలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం తెల్లవారు జామున 3.30 గంటల నుంచి (ఉత్తర రాజగోపురం ద్వారం) భక్తులకు స్వామివారు దర్శనమిస్తారు. ముక్కోటి ఏకాదశి రోజున స్వామి దర్శనం సర్వపాపహరణం అని భక్తులు భావిస్తారు. ఈ క్రమంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలి వస్తారు. భక్తుల రద్దీని అంచనా వేసిన ఆలయ అధికారులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ ఆవరణనూ రకరకాల పూలతో ప్రత్యేక అలంకరిస్తున్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం

- మంత్రి సవితకు కౌంట్ డౌన్ మొదలైంది
- మాజీ మంత్రి ఉషశ్రీచరణ్
- సోషల్ మీడియా కార్యకర్త బాలాజీరెడ్డి కుటుంబానికి పరామర్శ
- పార్టీ అధినేత పంపిన రూ.లక్ష చెక్కు అందజేత



బాలాజీరెడ్డి కుటుంబానికి చెక్కు అందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

రొద్దం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటూ కాపాడుకుంటామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కేవీ ఉషశ్రీచరణ్ స్పష్టం చేశారు. బుధవారం రొద్దం మండలంలో ఆమె పర్యటించారు. ఆర్.నాగిరెడ్డిపల్లిలో ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసిన సోషల్ మీడియా కార్యకర్త నగరూరు బాలాజీరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన భార్య, తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. సోషల్ మీడియాలో ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టులు చేయడం దారుణమన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. బాలాజీరెడ్డిని అరెస్ట్ చేయించడమే ఇందుకు నిదర్శనమన్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని మంత్రి సవిత అక్రమాలకు తెరలేపారన్నారు. రొద్దం గ్రామానికి చెందిన దివ్యాంగుడు షరీఫ్ కుటుంబానికి సంబంధించిన భూమిని మంత్రి అండతోనే ఆమె అనుచరుడు కబ్జా చేశాడని ఆరోపించారు. న్యాయం కోసం పోలీసుస్టేషన్‌కు వెళితే... దివ్యాంగుడని కూడా చూడకుండా ఎస్ఐ పరుషపదజాలంతో దూషణలకు పాల్పడడం బాధాకరమన్నారు. పెనుకొండ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డికి సంబంధించిన స్థలంలో దౌర్జన్యంగా రోడ్డు వేయించారన్నారు. ప్రజలతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్షకట్టి వేధిస్తున్న సవితకు కౌంట్ డౌన్ మొదలైందన్నారు.

మరోసారి నోరుజారితే ఊరుకోం

బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సవిత.. బీసీలకు మేలు చేసే అంశాల కన్నా... వైఎస్ జగన్‌పై ఆరోపణలు చేసేందుకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తిమ్మయ్య, సర్పంచ్ రాము, నాయకులు ఎస్.నారాయణరెడ్డి, బోయ నరసింహులు, లక్ష్మీనారాయణరెడ్డి, నారాయణరెడ్డి, వైశాలి జయప్పరెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

అసౌకర్యాల్లో ఆదర్శం

- సమస్యల వలయంలో జగరాజుపల్లి ఆదర్శపాఠశాల
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం



జగరాజుపల్లి మోడల్‌స్కూల్ వసతి గృహం

పుట్టపర్తి అర్బన్: ఉడకని పప్పు, నీళ్ల చారు, ముద్దగా మారిన అన్నం.. పుట్టపర్తి మండలం జగరాజుపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థినులకు రోజూ వడ్డించే భోజనం ఇది. కూటమి ప్రభుత్వం వసతి గృహాల్లోని విద్యార్థులకు రోజుకో వంటకం అంటూ ప్రచారం హోరెత్తిస్తున్నా...ఇక్కడ మాత్రం మెనూ అమలు కావడం లేదు. కనీస సౌకర్యాలూ కరువు కావడంతో విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు.

ప్రభుత్వం మారడంతో సమస్యలు..

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్యను అందించడానికి మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యతో పాటు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించేది. కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరగానే మోడల్‌స్కూళ్ల నిర్వహణ దారి తప్పింది. మెనూకు పూర్తిగా మంగళం పాడారు. ఉడికీ ఉడకనీ అన్నంత...నీళ్ల చారతోనే సరిపెడుతున్నారు. దీనికి తోడు ఆదర్శ పాఠశాల వసతి గృహం గ్రామానికి దూరంగా పొలాల్లో ఉండటం... వార్డెన్ స్థానికంగా ఉండకపోవడంతో విద్యార్థినులు బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు.

ఫిర్యాదు చేసినా....

జగరాజుపల్లి ఆదర్శ పాఠశాల వసతి గృహం సమస్యలపై ఇటీవల ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. పైగా సమస్య పరిష్కరించినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చిందని ఎస్ఎఫ్ఐ నాయకుడు పవన్ వాపోయారు. ప్రిన్సిపాల్ నిర్లక్ష్య ధోరణిపై గురువారం పుట్టపర్తి విమానాశ్రయానికి విచ్చేస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

కనీస సౌకర్యాలు కరువు..

ఆదర్శ పాఠశాల వసతి గృహం మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో ఒకరు లోపలుంటే బయట మరొకరు కాపలాగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక సాయంత్రం స్నాక్స్ ఇవ్వకుండా వంట మనుషులు, వార్డెన్ తీసుకెళ్తున్నారని, దీనిపై చాలాసార్లు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విద్యార్థినులు చెబుతున్నారు. వందలమంది విద్యార్థినులున్న వసతి గృహంలో కేవలం 5, 6 కిలోల చికెన్ తెచ్చి వండి పెడుతున్నారని, అందులోనే వంట మనుషులే తింటున్నారని చెబుతున్నారు. 5 నిమిషాలు లేటుగా వెళ్తే భోజనం పెట్టడం లేదని వాపోతున్నారు. వసతి గృహ భవనం నిర్వహణ సరిగా లేక శిథిలావస్థకు చేరిందని, డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేక మురుగు అక్కడే నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని విద్యార్థులు చెబుతున్నారు. అపరిశుభ్ర వాతావరణం వల్ల తరచూ రోగాల బారిన పడుతున్నామని, తల్లిదండ్రులకు విషయం చెబితే సిబ్బంది బెదిరిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు.



నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరిన భవనం



భవనం వద్ద ఉన్న మురుగు



చెత్తా చెదారంతో వసతి గృహం పరిసరాలు

క్లుప్తంగా

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

రామగిరి: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని డీఎంహెచ్ఓ ఫైరోజా బేగం ఆదేశించారు. బుధవారం రామగిరిలోని పీహెచ్‌సీని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. అందుతున్న వైద్య సేవలపై రోగులతో ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. సమపాలనతో విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రతాప్, సీహెచ్ఓ శారదారాణి, సిబ్బంది ఇంతియాజ్, తులసి తదితరులు పాల్గొన్నారు.

కత్తితో గొంతుపై పొడుచుకుని...

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన సోమశేఖర్ ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో బుధవారం రాత్రి కత్తితో గొంతుపై పొడుచుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. రెండో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి దుర్మరణం


వెంకటచరణ్ రెడ్డి (ఫైల్)

పెద్దపప్పూరు: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ నుంచి కిందపడి ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన వెంకటచరణ్‌రెడ్డి (30)కు భార్య సుజాత, ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నారు. నాపరాళ్ల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి నాపరాళ్లను చేర్చేందుకు ట్రాక్టర్‌లో లోడు చేసుకుని బుధవారం ఉదయం తన స్నేహితుడితో కలసి బయలుదేరాడు. 8 గంటల సమయంలో పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట అటవీ ప్రాంతంలో ప్రయాణిస్తుండగా డ్రైవర్ సీట్ పక్కన కూర్చొన్న వెంకటచరణ్‌రెడ్డి కుదుపులకు అదుపు తప్పి కిందపడ్డాడు. డ్రైవింగ్ చేస్తున్న స్నేహితుడు బ్రేక్ వేసేలోపు వెంకటచరణ్‌రెడ్డిపై ట్రాలీ టైర్ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కేసుల నమోదులో జాప్యమెందుకో!

హిందూపురం అర్బన్: సామాన్య వ్యక్తి వద్ద ఓ బాటిల్ కర్ణాటక మద్యం దొరికితే హడావుడి చేసి వాహనాలు సీజ్ చేసి ప్రెస్ నోట్ రిలీజ్ చేసే ఎక్సైజ్ అధికారులు... మంగళవారం రాత్రి 12 బెల్ట్ షాపుల్లో నకిలీ మద్యంతో పట్టుబడిన 12 మందిపై బుధవారం రాత్రి అయినా కేసు నమోదు చేయకుండా ఉపేక్షించారు. విచారణ పేరుతో హిందూపురం ఎక్సైజ్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. బుధవారం రాత్రి వరకు తొమ్మిది మంది తమ ఆధీనంలోనే ఉంచుకుని ఎక్సైజ్ అధికారులు రాచమర్యాదలు చేసినట్లు సమాచారం. వారిపై కేసుల నమోదు కానీ, అరెస్ట్‌కాని చూపకపోవడంతో పలువురు విలేకరులు ఎక్సైజ్ సీఐని సంప్రదించారు. దీంతో ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదంటూ ఆయన దాట వేశారు. కాగా, టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి.

సంక్రాంతి పండగ అంటే పల్లెల్లో ఎంతో సందడి ఉంటుంది. జనవరి నెల మొదలు కాగానే అన్ని గ్రామాల్లో ఈ పండుగ వాతావరణం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రతి రోజూ ఇంటి ముందు ముగ్గులు వేయడం, హరిదాసుల సంకీర్తనలు, అందరూ కలసి ఒక చోట చేరి ఆడిపాడి సందడి చేయడం, ముగ్గుల పోటీలు నిర్వహించడం, వివిధ క్రీడా పోటీలు లాంటి కార్యక్రమాలు ఎంతో సందడిగా జరుగుతుంటాయి. అయితే ఇందుకు భిన్నంగా కొన్ని శతాబ్దాలుగా సంక్రాంతి పండుగకు ఓ గ్రామంలో సగానికి పైగా ప్రజలు దూరంగా ఉంటున్నారు. ఇందుకు గల కారణాలు... విశేషాలు తెలుసుకోవాలంటే ఆత్మకూరు మండలంలోని పి.కొత్తపల్లి గ్రామాన్ని సందర్శించి తీరాల్సిందే.

– ఆత్మకూరు:


పి.కొత్తపల్లి ముఖచిత్రం

వారికి సంక్రాంతి లేదు!


ఓ ఊరి కథ

- ఆత్మకూరు మండలం పి.కొత్తపల్లిలో వింత ఆచారం
- శతాబ్దాలుగా పండుగ సంబరాలకు దూరంగా బోదపాటి వంశీకులు

ఆత్మకూరు నుంచి కళ్యాణదుర్గం వెళ్లే మార్గంలో ఐదు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే జాతీయ రహదారికి ఓ కిలోమీటరు దూరంలో పి.కొత్తపల్లి గ్రామం వస్తుంది. ఈ గ్రామంలో కమ్మ, బోయ, ఎస్సీ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. దాదాపు 300 గడపలున్న ఈ గ్రామ ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. వరి, చీనీ, వేరుశనగ, టమాట పంటల సాగుతో జీవనం సాగిస్తున్నారు. గ్రామం చుట్టూ ఎటు చూసినా పచ్చని పంట పొలాలు కనువిందు చేస్తుంటాయి. సమైక్య జీవనానికి, స్వశక్తికి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపాలుగా ఈ గ్రామస్తులు నిలుస్తున్నారు.

అనాదిగా వస్తున్న ఆచారాన్ని గౌరవిస్తూ..

సంక్రాంతి పండుగ విషయంలో బోదపాటి వారి భయాందోళనకు కారణమూ లేకపోలేదు. ఇందుకు సంబంధించి ఓ పురాతన కథను నేటికీ పూర్వీకులు చెబుతున్నారు. శతాబ్దాల క్రితం సంక్రాంతి సరుకుల కొనుగోలు కోసమని గ్రామానికి చెందిన బోదపాటి కుటుంబానికి సంబంధించిన వ్యక్తి ఆత్మకూరు సంతకు వచ్చారు. ఆ సమయంలో ఉన్నఫళంగా ఆయన కుప్పకూలి మృతి చెందాడు. ఇదేదో సాధారణ మృతిగానే అందరూ అప్పట్లో భావించారు. అయితే ఆ మరుసటి సంవత్సరం సంక్రాంతి పండుగ సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చిన బోదపాటి కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. ఇలా వరుసగా ఏటా సంక్రాంతి పండుగ చేయాలనే ఉద్దేశంతో సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చిన బోదపాటి కుటుంబంలోని ఎవరో ఒకరు మృత్యువాత పడుతుండడంతో ఒక్కసారిగా వారిలో ఆందోళన మొదలైంది. దీంతో సంక్రాంతి పండుగ జరుపుకోకూడదని బోదపాటి కుటుంబీకులు నిర్ణయించుకున్నారు. నాటి నుంచి నేటి వరకూ సంక్రాంతి పండుగకు బోదపాటి కుటుంబీకులు దూరంగా ఉంటూ వస్తున్నారు.

సంక్రాంతి అంటే బెదరు

హిందూ సంప్రదాయంలో వచ్చే ప్రతి పండుగనూ పి.కొత్తపల్లి వాసులు ఎంతో సంబరంగా జరుపుకుంటారు. అయితే సంక్రాంతి అంటే చాలు ఈ గ్రామంలో సగానికి పైగా జనాభా ఉన్న కమ్మ సామాజిక వర్గంలోని బోదపాటి వారు బెదిరిపోతుంటారు. సంక్రాంతి సందర్భంగా ప్రతి ఇంటి ముంగిట కనిపించే రంగవల్లులు వీరి ఇళ్ల ముందు కనిపించవు. గొబ్బెమ్మలు ఉండవు. పిండి వంటలు, నూతన వస్త్రాలకు దూరంగా ఉంటారు. ఇక గ్రామంలో జరిగే సంక్రాంతి సంబరాలకు సైతం బోదపాటి వారు దూరంగా ఉంటారు. రైతు కుటుంబంలో సాధారణంగా భోగి నాడు కనిపించే సందడి ఊసే ఉండదు. పశువులకు, పొలాల్లో నవధాన్యాలకు, ఇంట్లో పూజలు చేయరు. ఒక్క మాటలో చెప్పాలంటే సంక్రాంతి పండుగ నాడు కనీసం స్నానం చేయాలన్నా వీరు భయపడుతుంటారు.

నేను పుట్టినప్పటి నుంచి చూడలేదు



ప్రస్తుతం నాకు 45 సంవత్సరాలు. నేను పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ బోదపాటి వారు సంక్రాంతి పండుగను జరుపుకున్నది చూడలేదు. మా తాతల కాలం నుంచి కూడా ఇదే పద్ధతి కొనసాగుతూ వస్తోంది. ఒకవేళ బోదపాటి కుటుంబీకులు ఎవరైనా ధైర్యం చేసి పండుగ చేసేందుకు సిద్ధమైతే ఏదో ఒక ప్రమాదం బారిన పడుతున్నారు. దీంతో సంక్రాంతి నాడు ఇంట్లో పూజలు కూడా చేయం.

– గోపాల్, పి.కొత్తపల్లి, ఆత్మకూరు మండలం

పెద్దల ఆచారాలు గౌరవిస్తున్నాం



సంక్రాంతి పండుగ అంటే మా పల్లెల్లో అందరూ ఎంతో ఆనందంగా గడుపుతారు. కొత్త అల్లుళ్ల రాకతో ప్రతి ఇంట్లోనూ సందడిగా ఉంటుంది. కానీ, బోదపాటి వంశానికి చెందిన దాదాపు వంద కుటుంబాల వారు సంక్రాంతి పండుగ చేసుకోం. పెద్దల ఆచారాలు గౌరవిస్తూ ఇళ్ల ముందు ముగ్గులు వేయడం, ఇల్లు, వాకిలి శుభ్రం చేయడం ఇతర ఆచారాలు ఏవీ చేయం.

– రమాదేవి, పి.కొత్తపల్లి, ఆత్మకూరు మండలం

స్నానం కూడా చేయం



సంక్రాంతి అంటే అందరూ ఆనందంగా జరుపుకుంటారు. కానీ మా బోదపాటి వారు స్నానాలు కూడా చేయరు. పండుగ చేసుకుంటే ఏం జరుగుతుందో అనే భయం అందరిలోనూ ఉంది. దీంతో చాలా ఏళ్లుగా పండుగనాడు కూడా సాధారణ వంటకాలతోనే సరిపెట్టుకుంటాం.

– రాజప్ప, పి.కొత్తపల్లి, ఆత్మకూరు మండలం

దళిత మహిళలపై దాడి


ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

తనకల్లు: మండలంలోని దిగువ బత్తినవారిపల్లికి చెందిన దళిత మహిళలు జ్యోతి, లక్ష్మీనరసమ్మపై దాడి చేసిన కోలా నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. పొలం దారి విషయంలో ఇరు కుటుంబాల మధ్య వివాదం ఉంది. ఈ క్రమంలో బుధవారం జ్యోతి, నరసమ్మ బోరు వద్దకు వెళుతుండగా మధ్యలో దారి కాచిన నాగరాజు, నాయన భార్య గొడవపడి కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. గాయపడిన జ్యోతి, లక్ష్మీనరసమ్మను స్థానికులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఆరుద్ర శ్రీనివాసులు, మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా చైర్మన్ గంగులయ్య, రైతు సంఘం నాయకులు శివన్న తదితరులు బాధితులతో కలసి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆకట్టుకున్న డైట్ సంక్రాంతి సంబరాలు


భోగి మంటలు వేసిన డైట్ సిబ్బంది, విద్యార్థులు


సంక్రాంతి ముగ్గు వేస్తున్న విద్యార్థిని

పుట్టపర్తి: బుక్కపట్నంలోని ఉపాధ్యాయ శిక్షణ (డైట్) సంస్థలో బుధవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. డైట్ ప్రాంగణం మొత్తం రంగవల్లులతో విద్యార్థులు నింపేశారు. భోగి మంటలు వేసి సందడి చేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో అధికారులు ముగ్గుల పోటీలతో పాటు వ్యవసాయ పనిముట్లు, వంటకాలు, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, వ్యాయామ అధ్యాపకుడు రామకృష్ణ, పెదరాసు సుబ్రహ్మణ్యం, సిబ్బంది హనుమంతరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, రాధిక, నీలిమ, శ్రీనివాసులు, శ్రావణి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గడువు లోపు అహుడా లే ఔట్ల పూర్తి

- కూడేరు, గుత్తి, మడకశిరలో నూతన వెంచర్లు
- అహుడా చైర్మన్ టీసీ వరుణ్, జేసీ శివ్‌నారాయణ్ శర్మ


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న టీసీ వరుణ్, జేసీ

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం–హిందూపురం డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) లే ఔట్లను నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి అందుబాటు ధరలో వినియోగదారులకు అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకున్నట్లు అహుడా చైర్మన్ టీసీ వరుణ్ పేర్కొన్నారు. బుధవారం అహుడా కార్యాలయంలో అహుడా వైస్ చైర్మన్, జేసీ శివ్‌నారాయణ్ శర్మతో కలసి ఆయన మాట్లాడారు. అంతకు ముందు కూడేరు, గుత్తి, మడకశిర ప్రాంతాల్లో నూతన ఎంఐజీ లే అవుట్ల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరులో 28.25 ఎకరాల్లో 390, మడకశిరలో 9.3 ఎకరాల్లో 123, గుత్తిలో 11.82 ఎకరాల్లో 123 ప్లాట్లను వేస్తున్నట్లు తెలిపారు. 40 అడుగుల సీసీ రోడ్లు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, నీటి సరఫరా, సీవెజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, కరెంటు సరఫరా, తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రైవేట్ వెంచర్లకు దీటుగా అహుడా లే అవుట్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రాయితీతో స్థలాలను అందించనున్నామన్నారు. సమావేశంలో అహుడా కార్యదర్శి గౌరిశంకర్ రావు, కమ్మూరు పీఓ మహమ్మద్ ఇషాక్ అహమ్మద్, ఈఈ దుశ్యంత్, జేపీఓ హరీష్‌చౌదరి, సర్వేయర్ శరత్‌బాబు, డీఈ రేవంత్‌రెడ్డి, ప్లానింగ్ కార్యదర్శులు ప్రమీల, నాగశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ కప్ ఫైనల్స్‌కు కర్ణాటక, మధ్యప్రదేశ్



ట్రోఫీ వద్ద ఫైనల్‌కు చేరిన ఇరు జట్ల కెప్టెన్లు

అనంతపురం: అనంతపురం స్పోర్ట్స్ విలేజ్ వేదికగా లాలిగా ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ ఆఖరి ఘట్టానికి చేరుకుంది. బుధవారం నిర్వహించిన సెమీఫైనల్ మ్యాచ్‌లో కర్ణాటక, మధ్యప్రదేశ్ జట్లు గెలుపొందాయి. దేశ వ్యాప్తంగా 12 జట్లు ప్రాతినిథ్యం వహించిన ఈ టోర్నీలో ఇప్పటి వరకూ అన్ని జట్లూ విజయం కోసం హోరాహోరీగా తలపడ్డాయి. ఏ–టీంలో పాయింట్ల పట్టికలో కర్ణాటక మొదటి స్థానంలో నిలిచింది. మొత్తం ఆడిన 5 మ్యాచ్‌ల్లోనూ గెలుపొందింది. అలాగే బీ– టీంలోని మధ్యప్రదేశ్ (నర్మదా వ్యాలీ) జట్టు ఐదు మ్యాచ్‌లో నాలుగు మ్యాచ్‌లు గెలుపొంది పాయింట్ల పట్టికలో మొదటి స్థానానికి ఎగబాకింది. ఈ రెండు జట్లు గురువారం ఫైనల్ మ్యాచ్‌లో తలపడనున్నాయి.

శనేశ్వర స్వామి విగ్రహం ధ్వంసం


శనేశ్వర స్వామి విగ్రహం కుడి చేతిని పగులగొట్టిన దృశ్యం

హిందూపురం అర్బన్: స్థానిక మోతుకపల్లి సమీపంలో శనేశ్వర స్వామి ఆలయం ఆర్చ్ వద్ద ఏర్పాటు చేసిన స్వామి వారి రాతి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. ఈ నెల 6, 7 తేదీల్లో ఈ ఆలయానికి సమీపంలోనే ఇస్తేమా జరిగింది. అయితే విగ్రహాన్ని ఎవరు ధ్వంసం చేశారు అనే అంశంపై స్పష్టత లేదు. ఆలయ నిర్వాహకుల నుంచి ఫిర్యాదు అందుకున్న వన్‌టౌన్ పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. కాగా, విగ్రహం ధ్వంసంపై విశ్వ హిందూపరిషత్, హిందూ సంఘాల నాయకులు మండిపడ్డారు. రాష్ట్రంలో హిందూ ఆలయాలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు శనీశ్వర స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పట్టుచీరల వ్యాపారిపై కత్తితో దాడి

హిందూపురం అర్బన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ముదిరెడ్డిపల్లికి చెందిన పట్టు చీరల వ్యాపారి నారాయణరెడ్డిపై దుండగులు కత్తితో దాడి చేసి గొంతు కోశారు. బుధవారం వేకువజామున ఈ ఘటన చోటు చేసుకుంది. అదే సమయంలో హిందూపురం నుంచి ముదిరెడ్డిపల్లికి వస్తున్న ఆటో డ్రైవర్... రోడ్డు పక్కన ప్రాణాపాయ స్థితిలో పడి ఉన్న నారాయణరెడ్డిని గుర్తించి వెంటనే హిందూపురంలోని జిల్లాస్పత్రికి తీసుకెళ్లాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని ఆయన పరిస్థితిపై ఆరా తీశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. దాడికి కారణాలు తెలియాల్సి ఉంది.

ధ్వంసం చేస్తుంటే మీరేం చేస్తున్నారు?

- పీఆర్ ఎస్ఈపై జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సీరియస్
- పని తీరు, మాట తీరు మార్చుకోవాలని హితవు


పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: 'ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా రూ.కోట్ల ప్రజాధనంతో ప్రభుత్వం నిర్మించిన రోడ్లను కేబుల్ నెట్‌వర్క్ కోసం కాంట్రాక్టర్లు ధ్వంసం చేసి, వదిలేస్తుంటే మీరేం చేస్తున్నారు?' అంటూ పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) అహమ్మద్ జహీర్ అస్లాంపై జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన స్థాయీ సంఘం–1, 2, 4, 7(ఆర్థిక, ప్రణాళిక/గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం / ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించారు. అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, సీఈఓ రామచంద్రారెడ్డి, హాజరయ్యారు. కంబదూరు జెడ్పీటీసీ సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ... తమ మండలంలో పంచాయతీ రాజ్ సహా ఆర్అండ్‌బీ రహదారులను కేబుల్‌నెట్ వర్క్ నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు ధ్వంసం చేస్తున్నారని, తీసిన మట్టిని రోడ్లపై వేసి చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. దీనిపై పీఆర్ ఎస్ఈ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పడం నేర్చుకోవాలని హితవు పలికారు. మాట తీరు, పని తీరు మార్చుకోవాలన్నారు. కాంట్రాక్టర్లపై చర్య తీసుకుని రోడ్లను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీఈఓ మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ మొదలుపెట్టని పనులకు సంబంధించి నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపి పనులు చేపట్టేందుకు అనుమతులు తీసుకోవాలన్నారు.

వాస్తవ నివేదికలు సమర్పించండి..

జెడ్పీలోని అదనపు సమావేశ భవన్‌లో ఏర్పాటు చేసిన స్థాయీ సంఘం–3, 5, 6(వ్యవసాయం/ఐసీడీఎస్/సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలకు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, డి.హీరేహాల్ సభ్యురాలు హసీనా బేగం, గుమ్మఘట్ట జెడ్పీటీసీ మహేష్ అధ్యక్షత వహించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో పంట నష్టం అంచనా కోసం కేంద్ర కరువు బృందం పర్యటిస్తోందన్నారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడ పంట పొలాలు పచ్చగా ఉన్నాయని, వాటిని చూసి కేంద్ర బృందం పంటలు బాగున్నాయనుకుంటే రైతులందరూ నష్టపోతారన్నారు. కళ్ల ముందు కనిపించేది వాస్తవం కాదనే అంశాన్ని కేంద్ర బృందానికి జిల్లా యంత్రాంగం వివరించి.. రైతులకు ఎక్కువ మేలు జరిగేలా చొరవ చూపాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల ఆత్మహత్యలపై సంబంధిత అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారంటూ అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, నార్పల జెడ్పీటీసీ నాగరత్నమ్మ నిలదీశారు. అనంతపురం అర్బన్‌లోని కలెక్టరేట్ వెనకాల గల రాజేంద్రమున్సిపల్ స్కూల్ సమీపంలోని అంగన్‌వాడీ సెంటర్ వర్కర్ భాగ్యమ్మ పదేళ్లుగా విధులకు డుమ్మాకొడుతూ ప్రైవేటు కాలేజీలో అధ్యాపకురాలిగా వెళ్తోందని ఆధారాలతో సహా గత సమావేశంలో అధికారుల దృష్టికి తెచ్చామని,. ఏం చర్యలు తీసుకున్నారో సమాధానం చెప్పాలని జెడ్పీటీసీ చంద్రకుమార్ ప్రశ్నించారు. ఆమె భర్త జాయింట్ కలెక్టర్ సీసీ కావడంతో అధికారులు చర్యలకు వెనకడుగు వేస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ అంశంపై ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ మాట్లాడుతూ.. నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు పంపుతున్నట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని, గత సమావేశాల్లో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను వివరించారు.

11న 'సత్యసాయి' స్పోర్ట్స్ మీట్


బైక్‌పై సాధన చేస్తున్న విద్యార్థులు


రోప్ జిమ్నాస్టిక్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినులు

పుట్టపర్తి రూరల్: ఈ నెల 11న సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 43వ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ జరగనుంది. ఇందుకు సంబంధించి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ భారీగా ఏర్పాట్లు చేస్తోంది. పుట్టపర్తి, బెంగళూరులోని బృందావనం, ముద్దనహళ్లి, అనంతపురం క్యాంపస్, ఈశ్వరమ్మ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు, వైట్ ఫీల్డ్ నర్సింగ్ విద్యార్థులు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ నేపథ్యంలో సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు హిల్‌వ్యూ స్టేడియంలో బుధవారం ముమ్మర సాధన చేశారు.


ప్రాక్టీస్‌లో పాల్గొన్న విద్యార్థులు